
**కుదుపు కథ**

# ప్రతీక్ష

**—శ్రీమతి పి.వి.శేషారత్నం**



'బాలతార ప్రతీక్ష అర్ధరాత్రి మటుమాయం'.

'ఆచూకీ కోసం దేశమంతటా గాలింపు చర్యలు ఉధృతం—'

'ప్రతీక్ష లేక వెలవెలబోయిన సినీరంగం'

'ప్రతీక్ష రాకకై ఆత్రంగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు'

దేశమంతటా ఏ వార్తాపత్రిక చూసినా ఇవే హెడ్‌లైన్స్

— ప్రజలందరిలోనూ ఉత్సుకత—

భయం—

ఆందోళన—

దు:ఖం—

బాలతార ప్రతీక్ష లేత మొహం కళ్లల్లో కదలాడి మహిళలు, తల్లులు రోదిస్తున్నారు—

ఏపిల్ పళ్లలాంటి బుగ్గలు—

రోజాలో పసుపు మిళితం చేసిన వర్ణం—

గుబురు రెండు జడలు—

ఆల్చిప్పల్లాంటి కళ్లు—

లక్కపిడతలాంటి ఎర్రని బుల్లి నోరు—

కోటేరులాంటి నాసిక—

బొద్దుగా — అందంగా — బ్రహ్మ సినీరంగానికి ప్రత్యేకంగా తయారుచేసి సృష్టించిన అందాల రబ్బరు బొమ్మలాంటి ఆరేళ్ల పాప బేబీ ప్రతీక్ష—

తన జిలిబిలి పలుకుల చతుర సంభాషణలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించే ప్రతీక్ష సంవత్సరాదాయం కోట్లు—

ప్రొడ్యూసర్లు ఆ పాప నిలయంముందు క్యూలు కట్టినిలుచునేవారు—

మొదటి సినిమాయే రెండువందల రోజులు ఫుల్ కలెక్షన్స్‌తో ఆడటంతో ఒక్కసారి సినీ ఆకాశంలో కొత్త బాలతార తళుక్కుమంది—

అంతే—


వరదలా బుకింగులు—

కాల్‌షీట్లకోసం ఆమె తలిదండ్రులను ప్రాధేయపడని ప్రొడ్యూసర్ లేడు—

సినీరంగంలో ఒక్కసారిగా ప్రతీక్షకోసం పోటీ—

ప్రతీక్ష చుట్టూ రచయితలు ఎన్నో కథలు అల్లారు—

ప్రతీక్ష హీరోయిన్‌గా ఎన్నో చిత్రాలు—



పత్రికా విలేకరులు గుంపులు గుంపులుగా ఆ పాప ఇంటర్వ్యూకోసం పడిగాపులు కాస్తుంటారు.

ఎంతో కేజువల్‌గా— బుట్టబొమ్మలా— ఒకసారి బాబ్డ్ హెయిర్‌తో — బుట్టగౌనుతో—

మరోసారి పెద్ద పూలజడ — పరికిణీ జాకెట్టుతో—

మరోసారి మిడ్డీతో—

ఇంకోసారి లాగు చొక్కాతో—

పోనీటెయిల్‌తో—

రేబిట్ చెవుల్లాంటి గుజ్జుహెయిర్ స్టైయిల్‌తో

ఇలా ఎన్నోరకాల పోజులతో — సినీ పత్రికల్లో ఇంటర్వ్యూలు—

అంతకుముందున్న చాలా తారలంతా ఉల్కల్లా రాలిపోయారు—

సూర్యుడిముందు కాగడాల్లా అయిపోయారు

మరికొందరు — మొత్తంమీద బేబీ ప్రతీక్షలేని సినిమా జనం చూడరని దేశం అంతా అర్ధమయిపోయింది—

అన్ని భాషా చిత్రాల్లో ప్రతీక్ష—

ఎడ్వర్ టైజ్‌మెంట్లలో ప్రతీక్ష—

అంత చక్కగా ఎలా నటించగలవు పాపా — అంటే

'కేడ్ బరీస్ మహిమ' అని చిలిపిగా నవ్వే ప్రతీక్షలాంటి పాప తనకూ పుట్టాలని ప్రతి గర్భిణీ కోరుకునేది—

'నీకేదంటే ఇష్టం ప్రతీక్షా'— అంటే

బుగ్గ చూపించి — 'ఫ్లయింగ్ కిస్' అంటూ అల్లరిగా నవ్వే ప్రతీక్షలాంటి పాపలా తమ బిడ్డలు ఉండాలని ప్రతీ తల్లీ తండ్రీ ఆశించేవారు—

ప్రతీక్ష హెయిర్ స్టైయిల్స్—

ప్రతీక్ష — డ్రెస్ మోడల్స్

దేశమంతా పాపులర్ అయాయి—

అంత పేరు ప్రతిష్టలూ — డబ్బూ పుష్కలంగా సంపాదించిపెట్టిన ప్రతీక్ష మాయమయేసరికి

మునలి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు ఒకసారి గాలితీసిన బెలూన్లలా గొల్లుమనిపోయారు—

* * *

'ప్రతీక్షా!'

కిటికీలోంచి యూకలిప్టస్ చెట్లను చూస్తున్న ప్రతీక్ష ఇటు తిరిగింది—

మొహంలో ఆదుర్దా—

'మాదమ్మా నువ్వేం భయపడకు — నేనున్నానుగా—' తలను ఆప్యాయంగా స్పృశించాడు మిస్టర్

'ఇక్కడ నన్నెవరైనా గుర్తుపడితే—'

భయం తొంగి చూసింది బేబీ ప్రతీక్షలో—

షా నవ్వాడు—

'మనం ఇండియాకు కొన్నివేల మైళ్లలో ఉన్నాం

'మరి నన్ను హాస్పిటల్ లో ఎప్పుడు చేరుస్తారు—

షా మనసు ఆర్ద్రమైపోయింది—

'నువ్వున్నది హాస్పిటలే ప్రతీక్షా—'

ప్రతీక్ష చక్రాల్లాంటి కళ్లలో ఆశ్చర్యం—

'ఇదా?'

'అవును ఏం నచ్చలేదా?'

'ఇది ఇల్లులా వుందే'— ఆ ఎక్స్‌ప్రెషన్ ముద్దొచ్చేలావుంది—

'ఫారిన్ హాస్పటల్స్‌లో — నువ్వు నటించిన ఇండియన్ ఆస్పత్రుల్లోలా ఏడ్పులు, పెడబొబ్బలు — భయానక వాతావరణం ఉండవు— అదీగాక నీది స్పెషల్ కేస్ కదా అందుకని దీన్ని హాస్పటల్ అనేకంటే లేబరేటరీ అనొచ్చు—'

పాప కళ్ళల్లో ఒక్కసారి భయం తన్నుకొచ్చింది

అది చూసిన షా మనసు వికలమైపోయింది—

ఒక్కక్షణమే—

అంతలోనే తమాయించుకున్నాడు—

ప్రతీక్ష బుగ్గను నిమిరి అపురూపంగా ముద్దుపెట్టుకున్నాడు—

'వద్దు షాగారూ— ప్లీజ్ డోంట్ కిస్‌మీ—'

సున్నితంగా షాను వెనక్కు నెట్టింది బేబీ ప్రతీక్ష—

అతను చిన్నబుచ్చుకున్నాడు—

'షాగారూ! దయచేసి నన్ను అర్థం చేసుకోండి—

'చెప్పు పాపా ఒక్క నిమిషం' అంటూ కర్టెన్ లాగినట్టు వెళ్లి వెనక బటన్ ప్రెస్ చేసాడు—

వెనక రూంలో స్క్రీన్‌మీద ప్రతీక్ష మొహం టేప్ రికార్డర్‌లో బేబీ కంఠస్వరం రికార్డు కావడం మొదలయ్యింది—

స్క్రీన్‌ముందు అరడజనుమంది అమెరికన్ డాక్టర్లు కుతూహలంగా వాచ్ చేస్తున్నారు—

'ఆ ఇప్పుడు చెప్పు బేబీ'

'అదిగో ఆమాటే అనకండి మిస్టర్ షా'— నేను భరించలేకపోతున్నాను — నా మనసులో ఏదో అలజడి — ముద్దుపెట్టుకుంటే ఏదో తెలియని స్పందన — నా నరాలు కోరికలో వేగిపోతున్నాయి—'

బుల్లి తేనెలూరే పెదాలు అందంగా కదుల్తోంటే పాల బుగ్గలపాప మాటలు షాతో బాటు డాక్టర్ల మనసులని కదిలిస్తున్నాయి—

'షాగారూ! నా బాధకి విముక్తి లేదు— నన్ను చంపేయండి'.

బేబీ ఏడవడం మొదలెట్టింది— జిలిబిలి మాటలు—

షా ఉలిక్కి పడ్డాడు—

'పిచ్చిదానా! చంపేందుకా నిన్ను కోట్లాది భారతీయుల కళ్లుకప్పి ఇక్కడకు తెచ్చింది — మా దేశంనుంచి అంత చిన్నవయసులో ఇంత పేరు తెచ్చుకొన్న నిన్ను ఇంటర్వ్యూ చెయ్యాలని వచ్చిన మొదటిరోజే నీలో ఏదో అసహజత్వం కనిపించింది నాకు — మీ అమ్మానాన్నలకు కాస్త కళ్లు తిరిగే మొత్తం ముట్టజెప్పేసరికి నీతో ప్రైవేటు ఇంటర్వ్యూ అరేంజ్ చేసారు — తర్వాత నీకథ వినగానే నాలో రుుడుపు — తర్వాత మనిద్దరం పకడ్బందీగా పరారీ — ఆ తర్వాత ఇక్కడ — కథంతా నీకు తెలిసిందే — బే బ్రౌవ్ మై చైల్డ్'

ప్రతీక్ష మొహం ఎర్రబడింది—

'దయచేసి అలా సంబోధించకండి — నా వయసు ఇరవైరెండు అని మీకు తెలుసు — షూటింగుల్లో హీరోలు పసిపిల్లలా నన్ను ముద్దు పెట్టుకుంటుంటే నా మనసు కకావికలమయిపోవడం మొదలెట్టింది— సినీరంగంలో నన్ను చిరకాలం బాలతారగా నిలబెట్టి కోట్లకి కోట్లు గడించాలన్న దురాశతో అమ్మానాన్నలు చిన్నప్పటినుంచీ నాకు శరీరం ఎదగకుండా ఎప్పటికీ ఇలాగే ఉండిపోయేలాంటి ఇంజక్షన్లు ఇప్పించలిగారేగాని నా వయసు మాటే మర్చిపోయారు — నాతోటి వాళ్లంతా పెళ్లిళ్ల చేసుకుని అమ్మలు కూడా అయితే నేను బేబీలాగే ఉండిపోయాను — కానీ నా మనసుకి యుక్తవయసు వచ్చి చాలాకాలమయిందని మొదటిసారి గుర్తించింది మీరే — ఐ లవ్ యూ— అందుకే మీరు పాపా — బేబీ — చైల్డ్ అంటూంటే నేను తట్టుకోలేకపోతున్నాను. మీకు రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేస్తున్నాను — నన్నీ లేబ్‌లో జీవితాంతం ఉంచేయండి ఫరవాలేదు — ఎన్ని ఎక్స్‌పెరిమెంట్లకైనా నేను సిద్ధం — దయచేసి నా వయసును నా శరీరానికి ఇప్పించండి — మీరూ మంచి సైంటిస్టేగా — నిజం చెప్పండి — మళ్లీ నేను అందరిలా చక్కని యువతిని అవుతానా?'

పాలబుగ్గల్ని రెంతు చేతులతో కప్పుకుని రోదిస్తున్న ప్రతీక్షను చూస్తుంటే షా మనోనేత్రంలో అపురూప లావణ్యవతి అయిన ఒక స్త్రీ ప్రత్యక్షమయింది—

పక్కరూంలో స్క్రీన్‌ముందు — డాక్టర్లు విభ్రాంతితో బేబీ ప్రతీక్షను చూస్తున్నారు—

వారి వెన్నుపూసలో భయం జరజరా పాకుతోంది— దానితోబాటే అందరి మనసుల్లో ఒకటే ఆశ—

'ప్రతీక్ష కోరిక తీరాలి—'

రకరకాల పరీక్షలతో — రోజులు నిశ్శబ్దంగా గడుస్తుంటే—

ప్రతీక్ష విండోలోంచి యూకలిప్టస్ చెట్లను చూస్తూ తన ఆశ తీరేరోజు కోసం ప్రతీక్షిస్తూ వుంది—

యూకలిప్టస్ సానుభూతిగా మరో ఆకు రాల్చింది— అది మరో చిగురుకు సంకేతం— *



పరవాలేదు

"మునుపటికన్నా ఇప్పుడు పరవాలేదంటారా"? అడిగాడు డాక్టర్

"కొంచెం నయమే! మునుపటికన్నా కొంచెం వనువు తీసుకుని మాట్లాడుతున్నదండి మీ నర్స్!" చెప్పాడు పేషెంట్.

—ఎం.వి.కిరణ్ కుమార్
(విజయవాడ)



సుప్రీం హీరో.

నిర్మాతల యోగక్షేమాల్ని దృష్టిలో వుంచుకుని పరిశ్రమ ఎదుర్కొంటున్న స్లంప్‌ని దృష్టిలో వుంచుకుని సుప్రీం చిరంజీవి ఒంటరిగా తన పారితోషికంలో సగభాగం తగ్గించుకునే ఆలోచనలో వున్నట్లు పరిశ్రమలో ప్రముఖుల గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే రియల్ సుప్రీం హీరో చిరంజీవే.

—సాయిరాం

